

సాక్షి మెదక్
శనివారం : 28 : జనవరి : 2023



బియ్యం.. కయ్యం
ఎంఎల్ఎస్ పాయింట్లు బియ్యం దందాకు కేరాఫ్‌గా మారాయనే ఆరోపణలున్నాయి. తూకంలో మోసం జరుగుతుందని రేషన్ డీలర్లు వాపోతున్నారు. 8లో



ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు
ఖేలో ఇండియా అండర్–17 బాలికల ఫుట్ బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సెమీస్‌లో ఓడిన గజ్వేల్ జట్టు, తరువాతి మ్యాచ్‌లో గెలిచి మూడో స్థానం సాధించింది. 8లో



ఆలయ కమిటీ ఏర్పాటు ఎప్పుడు?
కౌడిపల్లి మండల పరిధిలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయ కమిటీని ఏర్పాటు చేయడంల లేదు. మార్చి నెలలో ఉత్సవాలు జరుగనున్నాయి. 9లో

న్యూస్‌రీల్

పరేడ్‌తో ఫిజికల్ ఫిట్‌నెస్

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



పరేడ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: వీక్లీ పరేడ్‌తో సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్ పెరుగుతుందని ఎస్పీ రోహిణీప్రియదర్శిని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం శుక్రవారం మెదక్ పట్టణ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి ఆర్మ్ డ్రిల్, ఫుట్ డ్రిల్ నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ అచ్యుతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రిల్‌లో పెద్ద ఎత్తున సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమయం దొరికినప్పుడు సిబ్బంది అధికారులు వ్యాయామం చేయడమనేది ముఖ్యమన్నారు. మంచి శక్తి సామర్థ్యాలతో విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫిట్‌నెస్‌ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'నాలుగు యూనిట్లు సరిపోవు'

మైనార్టీ అభ్యర్థుల ధర్నా



ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

పాపన్నపేట (మెదక్) : మైనార్టీ కార్పొరేషన్ మంజూరు చేసిన నాలుగు యూనిట్లు ఏ మాత్రం సరిపోవని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పాపన్నపేట మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నిరుద్యోగులైన మైనార్టీ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు మైనార్టీ కార్పొరేషన్ కింద రుణాలు అందిచేందుకు దరఖాస్తులు స్వీకరించారు. దీనికి సుమారు 119 మంది దరఖాస్తు చేసుకున్నారు. తీరా ఇంటర్వ్యూ సమయంలో నాలుగు యూనిట్లు ఉన్నాయని తెలవడంతో అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు యూనిట్లు సరిపోవని వెంటనే యూనిట్లను పెంచాలని మెదక్ బొడ్మట్‌పల్లి రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో కలీం, మోయిన్, అహ్మద్, ముస్తాక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పరీక్షా పే చర్చలో విద్యార్థినులు



ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

మెదక్‌జోన్: ప్రధాని మోదీ విద్యార్థుల పరీక్షలపై శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన 'ప్రధాని పరీక్షా పే చర్చా వేదిక'లో మెదక్ పట్టణంలోని ప్రభు త్వ బాలికల కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కలదేవి మధు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, ప్రధాన కార్యదర్శి సతీశ్, కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్య నిధిపై అవగాహన

నర్సాపూర్ : ఉద్యోగుల భవిష్య నిధిపై ఉద్యోగులకు, పెన్షనర్లకు అవగాహన కల్పించడంతోపాటు సమస్యలను వారి వద్దకే వెళ్లి పరిష్కరించేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నామని భవిష్య నిధి ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చేరువ కావాలనే ఉద్దేశ్యంతో ప్రతి నెలా 27వ తేదీన శిబిరాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 'భవిష్య నిధి మీ చేరువ' కార్యక్రమంలో భాగంగా శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శిబిరం వద్ద ఉద్యోగులు, పెన్షనర్లు, ఆయా సంస్థల యాజమాన్యాలు అందజేసే ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. దీన్ని నిర్వహించేందుకు ప్రతీ జిల్లాకు ఒక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని విశాల్ అగర్వాల్ వివరించారు. నర్సాపూర్‌లో నిర్వహించిన శిబిరంలో జిల్లా నోడల్ అధికారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగని సాగు గోస

పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు

- రాష్ట్రంలో రెండో స్థానంలో 'సంగారెడ్డి'
- నాలుగో స్థానంలో మెదక్, ఏడో స్థానంలో సిద్దిపేట
- ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లలో 13,461 మంది మృత్యువాత
- ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు



2021-22లో అందిన బీమా వివరాలు..

జిల్లా	కుటుంబాలు	పరిహారం (రూ.కోట్లలో)
సంగారెడ్డి	1,414	రూ.70.70
మెదక్	1,189	రూ.59.45
సిద్దిపేట	1,011	రూ.50.55

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'మయామైపోతున్నడమ్మ.. మనిషన్నవాడు' అని వాగ్గేయకారుడు అందెశ్రీ పాడిన పాట ఉమ్మడి జిల్లాలోని రైతుల దీన స్థితికి అద్దం పడుతోంది. కాకపోతే ఇక్కడ మాయవుతుంది రైతులు.. రోజురోజుకూ పెరుగుతున్న కష్టాలు, నష్టాలతో వారు బలవంతంగా తనువు చాలిస్తున్నారు. ఓ వైపు పెరిగిన ఎరువుల ధరలు.. మరో వైపు తగ్గుతున్న దిగుబడి.. అందని మద్దతు ధర.. వెరసి తెచ్చిన అప్పులు తీర్చలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లో సంగారెడ్డి జిల్లా రెండో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నాలుగేళ్ల కాలంలో సంగారెడ్డిలో 5,489 , మెదక్‌లో 4,160, సిద్దిపేటలో 3,802 మంది చొప్పున రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ స్టాటిస్టికల్ నివేదిక ఈ అంశాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

- అన్నదాతల మరణాలు ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాష్ట్రంలో మొదటి స్థానంలో నల్లగొండ జిల్లా జిల్లా ఉంది. కాగా 49 – 59 ఏళ్ల మధ్య వయసున్న రైతుల మరణాల్లో మాత్రం రాష్ట్రంలో అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో ఉండటం గమనార్హం. మృతి చెందిన రైతులకు సంబంధించి బీమా పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం అందజేసింది.
- రైతుబంధు పథకం లబ్ధిదారుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. మూడేళ్లలో సుమారు 18 శాతం పెరిగినట్లు స్పష్టమవుతోంది.
- గుంట భూమి ఉన్నా నిరుపేద రైతులకు సైతం రైతుబీమా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- రెండు, మూడు ఎకరాల భూమి ఉన్న రైతులు సైతం కొంత భాగాన్ని తమ కుటుంబ సభ్యుల పేర్లపైకి మార్చుకొని అందరనీ బీమా పథకానికి అర్హత సాధించే విధంగా చర్యలు తీసుకోవడం గమనార్హం.
- దీంతో ఈ పథకం కింద లబ్ధిదారుల సంఖ్య ఏటా కొంత మేరకు పెరుగుతూ వస్తోంది.

రూ.180.7 కోట్ల పరిహారం

- 2018– 22 వరకు నాలుగేళ్లలో రాష్ట్రంలో మొత్తం 88,620 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.
- అందులో ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే 5,489 మంది రైతులు మరణించినట్లు తేలింది. ఇందులో 49– 59 ఏళ్ల వయసున్నవారు అత్యధికంగా 2,689 మంది ఉన్నారు.
- అలాగే నాలుగో స్థానంలో ఉన్న మెదక్ జిల్లాలో 4,160 మంది రైతులు మరణించారు. సిద్దిపేట జిల్లాలో 3,802 రైతులు మరణించారు. వీళ్ల కుటుంబాల అందరికీ రైతుబీమా పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం అందించినట్లు నివేదికల్లో పేర్కొన్నారు.
- ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,614 మంది రైతు కుటుంబాలకు రూ.180.7 కోట్ల పరిహారాన్ని అందజేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్

పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు

కలెక్టర్ హరీశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా అవినీతికి తావు లేకుండా నిర్వహిస్తామని కలెక్టర్ హరీశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో మన ఊరు మన బడి, ఉపాధ్యాయుల బదిలీలు అంశంపై సమీక్షించారు. కార్యక్రమంలో మేడ్చల్ నుంచి పాల్గొన్న కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శంగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ఎంపిక చేసిన మోడల్ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని కలెక్టర్ తెలిపారు. దాదాపు పూర్తి కావొచ్చాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- తూప్రాన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తూప్రాన్: ప్రజల ఇబ్బందులను గుర్తించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి అదనపు కలెక్టర్‌తోపాటు గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఆర్డీఓ శ్యాంప్రకాశ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కట్టపై ఓపెన్ జిమ్, కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ, పాత మున్సిపల్ భవనం ఎదురుగా డివైడర్‌పై నాటిన ఈత చెట్ల చుట్టూ ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, 12వ వార్డు ఏబీ కాలనీలో తెలంగాణ క్రీడా మైదానం చుట్టూరా పెన్సింగ్ తదితర అభివృద్ధి పనులను చర్చించారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు తీర్మానానికి ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మోహన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, ఏఈ సాయిరెడ్డి, మేనేజర్ రఘువరన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంటలో సంపూర్ణ మద్యపాన నిషేధం

- తీర్మానం చేసిన గ్రామస్తులు
- కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రం అందజేసిన సర్పంచ్
- బెల్ట్ షాపుల్లో అమ్మితే జరిమానా

రామాయంపేట/నిజాంపేట (మెదక్): నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో లెక్కకు మించి కొనసాగుతున్న బెల్ట్‌షాపులతో గ్రామ యువకులు దారి తప్పుతున్నారు. దుకాణాల్లో 24 గంటల పాటు బహిరంగంగా మద్యం అమ్మకాలు కొనసాగుతుండటంతో గ్రామంలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు ఇటీవల ఒక యువకుడు మద్యం సేవించి మృతి చెందడం గ్రామస్తులను కలిచివేసింది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన యువకులు నాలుగైదు రోజులుగా ఆందోళన బాట పట్టారు. యువకులు మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపులపై దాడి చేసి మద్యం బాటిళ్లు ధ్వంసం చేయడంతోపాటు దుకాణదారులకు హెచ్చరికలు జారీచేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ తమ్మన్నగారి కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో మద్యం అమ్మకాలు బంద్ చేయాలని ఏకగ్రీవ తీర్మాణం చేశారు. నేటి నుంచి గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలులో ఉంటుందని, ఎవరైనా మద్యం అమ్మితే రూ. 10వేలు జరి మానా, కొన్న వారికి రూ. 5 వేలు జరిమానా విధిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో మద్యం అమ్మకాలు కొనసాగితే పట్టించిన వారికి రూ.2వేలు నజరానా అందజేస్తామని ప్రకటించారు. అనంత రం కలెక్టర్, ఎస్పీ కార్యాలయంలో, రామాయంపేట ఎక్సైజ్ సీఐ, సివిల్ సీఐకి తీర్మానం కాపీలు అందజేశారు.



గ్రామసభలో తీర్మానం చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

విధుల్లో ప్రజల మన్ననలు పొందాలి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



సూచనలు చేస్తున్న రోహిణీప్రియదర్శిని

చేగుంట(తూప్రాన్): ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని పోలీసులకు సూచనలు చేశారు. మండల కేంద్రమైన నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. 100 డయల్ రాగానే తక్షణమే స్పందించాలని క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు కేసులను పెండింగ్‌లో ఉంచకూడదన్నారు. బ్లూకోట్స్, పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిరంతరం చేపట్టాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ నర్సింలు, సిబ్బంది ఉన్నారు.

కొత్త మండలాల అభివృద్ధి పట్టని ప్రభుత్వం

కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



బచ్చురాజ్‌పల్లిలో కరపత్రాలు అందజేస్తున్న తిరుపతిరెడ్డి , నాయకులు

రామాయంపేట/నిజాంపేట (మెదక్): కొత్తగా ఏర్పాటైన మండలాల అభివృద్ధి విషయమై ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. 'చేయి చేయి కలుపుదాం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిజాంపేట మండలం బచ్చురాజ్‌పల్లి, తిప్పనగుల్ల, కె.వెంకటాపూర్ గ్రామాల్లో పర్యటించి పాదయాత్ర చేపట్టారు. అనంతరం గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని ఆకాంక్షించి ఎమ్మెల్యే రాజీనామా చేస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోలేదని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనన్న విషయం అందరికీ తెలుసని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు. సమావేశంలో పీసీసీ సభ్యులు సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ, మామిళ్ల ఆంజనేయులు, పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, రామాయంపేట, నిజాంపేట మండలాల పార్టీ అధ్యక్షులు శ్యాంరెడ్డి, లింగంగౌడ్, డీసీసీ కార్యదర్శి బైరం కుమార్, ఇతర నాయకులు చింతల యాదగిరి, సురేందర్‌గౌడ్, హఫీజొద్దీన్, పంజా మహేందర్, మారుతీ, శ్రీనివాస్, నసీరుద్దీన్, మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ బొర్ర అనీల్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, అల్లాడి వెంకటేశ్, ప్రవీణ్ రెడ్డి, కాకి రాజయ్య పాల్గొన్నారు.

గుట్టలు, కుంటలు మాయం

అక్రమంగా మట్టి తవ్వకాలు

- వందలాది టిప్పర్లతో వెంచర్లకు తరలింపు
- కుంటలను పూడ్చి కంచె ఏర్పాటు
- అనుమతులు లేవు.. అడిగేవారు లేరు
- కన్నెత్తి చూడని అధికారులు

మెదక్‌జోన్ : జిల్లాలో గుట్టలు, కుంటలు మాయమవుతున్నాయి. ఏళ్ల తరబడి ప్రకృతిమయంగా ఉన్న కొండలు రాత్రికిరాత్రే మాయమవుతున్నాయి. తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్నట్టుగా అక్రమార్కులు మట్టిని తవ్వకాలు చేపడుతున్నారు. ఈ మట్టిని అనుమతి లేకుండానే వెంచర్లకు తరలిస్తున్నారు. అలాగే ఎక్కడైనా ఖాళీలుగా కుంటలు కనిపిస్తే పూడ్చివేసి కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలు రోజురోజుకూ విస్తరిస్తుండటంతో భూములకు భారీగా ధరలు పెరిగాయి. దీంతో పట్టణ పరిసర ప్రాంతాల్లోని గుట్టలను తవ్వుతూ వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
- అక్రమంగా కుంటలు, చెరువులను పూడ్చివేస్తూ దర్జాగా కబ్జా చేసి చుట్టూరా కంచెలు వేస్తున్నారు.
- ఇదంతా అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంతా సహజ సిద్ధంగా వెలిసిన గుట్టలు మాయమవుతున్నాయి. చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నాయి.
- ఇదేంటని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తే మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకొండని బహిరంగంగానే దాడులకు దిగుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లాలో నీటి వనరులు మాయమైపోవడం కాయమని పలువురు పేర్కొంటున్నారు.
- మెదక్ పట్టణ శివారులోని చేగుంట–మెదక్ ప్రధాన రహదారి పక్కన ఇటీవల మాతాశిశు ఆస్పత్రి(ఎంసీహెచ్) నిర్మించడంతో దాని పక్కనే ఉన్న కుమ్మరి కుంటను కొందరు అక్రమార్కులు పూడ్చివేసి చుట్టూ కంచె వేశారు.
- ఈ తతంగం అధికారులకు తెలిసినా ఏమి చేయడం లేదు. అధికార పార్టీ నాయకుల అండ ఉందని ఓ ఉన్నతాధికారి పేర్కొనడం గమనార్హం.
- దీని పక్కనే గల రాజ్‌పల్లి శివారులో చేగుంట–మెదక్ ప్రధాన రహదారిని ఆనుకొని ఓ గుట్ట ఉంది. దానిని తవ్వుతూ నిత్యం వందలాది టిప్పర్ల మట్టిని జేసీబీల ద్వారా వెంచర్లకు తరలిస్తున్నారు.
- జిల్లా కేంద్రంలోనే కాకుండా నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి నెలకొంది.
- తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 288లో ప్రభుత్వ అసైన్డ్ భూమిలో గతేడాది నవంబర్ మాసంలో రాత్రికి రాత్రే 70 అడుగుల మేర సిమెంట్ రోడ్డు వేశారు.



మెదక్ పట్టణ శివారులోని గుట్టను తవ్వేసిన దృశ్యం



మెదక్ పట్టణ పరిధిలోని ఓ వెంచర్‌లో పోసిన మట్టి

- నర్సాపూర్ నియోజకవర్గం శివ్వంపేట మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామ శివారులో గల కరీంకుంట, గుల్ల కుంటలను కొందరు అక్రమార్కులు ఆక్రమించి అందులో మట్టిపోసి కంచె వేశారు.
- ఈ విషయాన్ని ఆ గ్రామస్తులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు.
- జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో చెరువు, కుంటలను పూడ్చటం, ప్రభుత్వ స్థలాల్లో వెంచర్లు వేయడం, ప్రభుత్వ స్థలాల నుంచి రోడ్లు వేసి వెంచర్లకు దారులు నిర్మిస్తున్నారు.

చర్యలు తప్పవు..

చెరువులు, కుంటలతోపాటు ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించడం నేరం. గుట్టల నుంచి అక్రమంగా తవ్వి మట్టి తరలిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

– రమేశ్ అదనపు కలెక్టర్

కార్యాలయం ఎదుట కొబ్బరికాయ కొట్టి నిరసన



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ దుకాణాలకు రీటెండర్ వేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఎదుట కొబ్బరికాయలు కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్ దుకాణాలకు రీ టెండర్ వేస్తామని అధికారులు హామీ ఇచ్చి రెండేళ్లు గడిచిపోయిందని ఇప్పటికీ అమలులోకి తీసుకురాకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని నిరుద్యోగ యువకులు ఉపాధి కరువై పడరాని పాట్లు పడుతున్నారన్నారు. మరో వైపు దుకాణాల్లో బినామీలు కొనసాగుతుండగా మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ దుకాణాలకు రీటెండర్ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్, ప్రవీణ్, ప్రభాకర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెడ్డి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా మల్లారెడ్డి


మల్లారెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న వెంకట్‌ రెడ్డి

దుబ్బాక: సిద్దిపేట జిల్లా రెడ్డి హక్కుల సాధన సమితి అధ్యక్షుడిగా చెల్లాపూర్‌ 3వ వార్డు కౌన్సిలర్‌ మట్ట మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రెడ్డి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాతూరు వెంకట్‌ రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు మట్ట మల్లారెడ్డి మాట్లాడుతూ రెడ్డి హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరదారెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఏడుపాయల జాతరకు రూ.2 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌ రెడ్డి



పాపన్నపేట (మెదక్‌): మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయల జాతరకు సీఎం కేసీఆర్‌ రూ. 2 కోట్లు మంజూరు చేసినట్లు మెదక్‌ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఏడుపాయల జాతరకు తెలంగాణ రాష్ట్రం వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారని తెలిపారు. జాతర భక్తులకు మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా, వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌, నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌ రెడ్డికి ఏడుపాయల పాలకవర్గ చైర్మన్‌ బాలాగౌడ్‌, ధర్మకర్తలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. బదిలీలు, పదోన్నతులలో పాల్గొనే ఉపాధ్యాయులకు ఈనెల 28 నుంచి 30 వరకు సిద్దిపేట జిల్లా ఏరియా ఆస్పత్రి 3వ అంతస్తులో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య పరీక్షలు చేసి మెడికల్‌ సర్టిఫికెట్‌ అందజేస్తామన్నారు.

చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికుడు మృతి

సిద్దిపేటకమాన్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట వన్‌ టౌన్‌ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్‌ నగర్‌కు చెందిన దాసరి నారాయణ (56) మున్సిపల్‌ కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శివాజీ నగర్‌ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు.

బియ్యం.. కయ్యం


- తరుగుతో నష్టపోతున్నామంటున్న రేషన్‌ డీలర్లు
- మూడు నెలల సెలవుకు వినతి
- మిరుదొడ్డి ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌పై ఆరోపణలు

సాక్షి, సిద్దిపేట: పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా రేషన్‌ బియ్యం అందిస్తోంది. ఎంఎల్‌ఎస్‌ పాయింట్లు బియ్యం దందాకు కేరాఫ్‌గా మారాయనే ఆరోపణలున్నాయి. రేషన్‌ దుకాణాలకు సరఫరా చేస్తున్న బియ్యం తూకంలో మోసం జరుగుతుందని రేషన్‌ డీలర్లు వాపోతున్నారు. సిద్దిపేట జిల్లాలో ఆహార భద్రత కార్డులు 2,73,156, అంత్యోదయ కార్డులు 18,654, అన్నపూర్ణ కార్డులు 86 ఉన్నాయి. వీటికి 708 రేషన్‌ షాపుల ద్వారా ప్రతినెలా బియ్యం పంపిణీ జరుగుతోంది.

- అక్బర్‌పేట– భూంపల్లి, మిరుదొడ్డి మండలాల్లో ఆహార భద్రత కార్డులు 11,744, అంత్యోదయ కార్డులు 748, అన్నపూర్ణ కార్డులు 13 ఉన్నాయి. ఈ రెండు మండలాల పరిధిలో 29 మంది రేషన్‌డీలర్ల ఉన్నారు. మిరుదొడ్డి ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌ నుంచే వీరికి రేషన్‌ బియ్యం పంపుతున్నారు.
- వాస్తవానికి ఒక్కో బియ్యం బస్తా 50 కేజీలు ఉండాలి. కానీ బస్తా 47 నుంచి 48 కిలోలు ఉంటుదని డీలర్లు ఆరోపిస్తున్నారు. ఒక్కో బస్తాలో 2 నుంచి 3 కిలోలు తక్కువ తూకం ఉండడంతో ఒక్కో డీలర్‌ నెలకు 3 నుంచి 4 క్వింటాళ్ల బియ్యం నష్టపోవాల్సి వస్తోంది.
- ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌ ఇన్‌చార్జ్‌ వ్యవహారశైలితో నష్టపోతున్నామని తమకు మూడు నెలల సెలవు ఇవ్వాలని రేషన్‌ డీలర్లు ఈ నెల 21న తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

బయటకు తరలింపు

ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లోనే బస్తాల నుంచి బియ్యం తీస్తున్నారని రేషన్‌ డీలర్లు ఆరోపిస్తున్నారు. ఆ బియ్యాన్ని ఇటీవల బయటకు తరలిస్తుండగా పలువురు చూడటంతో తిరిగి మళ్లీ మిరుదొడ్డి ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌కు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ తతంగం ఒక్క మిరుదొడ్డికే పరిమితం కాలేదని, జిల్లా వ్యాప్తంగా ఆయా ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లలో బియ్యం బస్తాలను తక్కువ తూకంతో పంపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.


తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రం ఇదే

మూడు క్వింటాళ్లకు పైనే



నెలకు ఒక్కో డీలర్‌ షాపునకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల బియ్యం తరుగు వస్తోంది. మిరుదొడ్డి ఎంఎల్‌ ఎస్‌ పాయింట్‌లో 786 క్వింటాళ్ల బియ్యం దారి మళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి. లేదంటే మూడు నెలల సెలవు ఇప్పించాలి. – జూలూరి నాగభూషణం, మండల రేషన్‌ డీలర్ల సంఘం అధ్యక్షుడు

విచారణ నివేదిక రాగానే చర్యలు

మిరుదొడ్డి ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌ ఇన్‌చార్జ్‌పై పలు ఆరోపణలు రావడంతో విచారణకు ఆదేశించాను. నివేదిక రాగానే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. – హరీశ్‌, డీఎస్‌ఓ

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఖేడ్‌ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్‌: రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌, బీజేపీల నుంచి పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నారాయణఖేడ్‌ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌ జిల్లా చిల్లర్గి, జాంపాడ్‌, మలేగాం గ్రామాలకు చెందిన కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ చేపట్టిన రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌, ఉచిత విద్యుత్‌, మిషన్‌ భగీరథ పథకాలపై ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్‌, బీజేపీ పార్టీలకు చెందిన శివకుమార్‌, వైజ్యనాథ్‌, దేవేందర్‌, నర్సప్ప, లాజర్‌, మన్సూర్‌, సుందర్‌, సాగర్‌ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు పార్శెట్టి సంగప్ప, న్యాల్‌కల్‌ మండల అధ్యక్షుడు రవీందర్‌, రాజుపటేల్‌, డప్పూర్‌ సర్పంచ్‌ రవికుమార్‌, సిద్దప్ప, సంగమేశ్వర్‌, సంజీవ్‌చారి, ఖేడ్‌ మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ బాసిత్‌ తదితరులు ఉన్నారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

మహిళా, శిశు సంక్షేమ విభాగం కౌన్సిలర్‌ యాదగిరి


బాలుడితో ఆపరేషన్‌ స్మైల్‌ అధికారులు

వట్‌పల్లి(అందోల్‌): బాలలతో పని చేయిస్తే కేసులు నమోదు చేస్తామని మహిళా, శిశు సంక్షేమ విభాగం కౌన్సిలర్‌ యాదగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని వట్‌పల్లిలో ఆపరేషన్‌ స్మైల్‌–9 డ్రైవ్‌లో భాగంగా దుకాణాల్లో కూలీలుగా పనిచేస్తున్న నలుగురు బాలలను గుర్తించి విముక్తి కల్పించారు. బిహార్‌, రాజస్థాన్‌ రాష్ట్రాలకు చెందిన ముగ్గురిని, వట్‌పల్లికి చెందిన ఓ బాలుడిని గుర్తించినట్లు తెలిపారు. బాలుర తల్లిదండ్రులకు కౌన్సిలింగ్‌ ఇచ్చి వారిని అప్పగించినట్లు ఆయన తెలిపారు. బాలకార్మిక చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని, ఎవరైనా బాలలతో పనిచేయించినట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.మొగులయ్య, సిబ్బంది గీత, కానిస్టేబుల్‌ ఆర్‌.నవీన్‌ గౌడ్‌, హోంగార్డు సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్‌ పోటీలు


ఫుట్‌బాల్‌ ఆడుతున్న క్రీడాకారులు

- మూడో స్థానంలో గజ్వేల్‌
- నేడు ముగింపు వేడుకలు

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ జ్యోతిబాపూలే మహిళా గురుకుల కళాశాల స్టేడియంలో తెలంగాణ ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ నిర్వహించిన ఖేలో ఇండియా అండర్‌–17 బాలికల ఫుట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు శుక్రవారం ఆరో రోజుకు చేరాయి. సెమీస్‌లో ఓడిన గజ్వేల్‌ జట్టు, తర్వాతి మ్యాచ్‌లో విజయం సాధించి తృతీయ స్థానానికి పరిమితమైంది. ఉదయం తొలి సెమీ ఫైనల్‌ మ్యాచ్‌ గజ్వేల్‌ ఫుట్‌బాల్‌ క్లబ్‌, కేర్‌ ఫుట్‌బాల్‌ అకాడమీ నిజామాబాద్‌ జట్ల మధ్య జరిగింది. 3–1 గోల్స్‌ తేడాతో నిజామాబాద్‌ జట్టు గెలుపొందింది. నిజామాబాద్‌ తరఫున ఏ.సుశాంతిక, వి.చైతన్య, జి.సాయి సమీక్ష ఒక్కో గోల్‌, గజ్వేల్‌ జట్టు తరఫున శైలజ ఒక గోల్‌ చేశారు. రెండో సెమీఫైనల్‌ మ్యాచ్‌ తూంకుంట స్పోర్ట్స్‌ స్కూల్‌, దక్కన్‌ డైనమోస్‌ మధ్య జరిగింది. 6–0 గోల్స్‌తో స్పోర్ట్స్‌స్కూల్‌ విజయం సాధించింది. విజేత జట్టు తరఫున టి.నగ్మ 3, బి.అంకిత, మిహిక గుప్త, ఎం.లాస్య ఒకటి చొప్పున గోల్స్‌ చేశారు. తృతీయ స్థానం కోసం గజ్వేల్‌, దక్కన్‌ డైనమోస్‌ మధ్య పోటీలో గజ్వేల్‌ జట్టు 4–2 గోల్స్‌తో గెలిచింది. ఇందులో బి.శైలజ 2, కె.నందిని, ఎస్‌ సిరి ఒక్కో గోల్‌ చేశారు. ప్రత్యర్థి జట్టులో ఐశ్వర్య, తాన్యశ్రీ ఒక్కోగోల్‌ చేశారు. తూంకుంట స్పోర్ట్స్‌ స్కూల్‌, సీఎఫ్‌ఏ నిజామాబాద్‌ జట్ల మధ్య ఫైనల్‌ పోరు ఫలితాలు శనివారం ముగింపురోజు వెల్లడిస్తామని అసోసియేషన్‌ ప్రతినిధులు గణేశ్‌, చక్రపాణి పేర్కొన్నారు.

తల్లి మందలించిందని...


శివకుమార్‌ మృతదేహం

మెదక్‌ మున్సిపాలిటీ: తాగొద్దని తల్లి మందలించిందని కొడుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మెదక్‌ పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గ కాలనీకి చెందిన ఎర్రొల్ల భవాని– రాజు దంపతుల కొడుకు శివకుమార్‌(16) ఈ నెల 26న కల్లుతాగి రోడ్డుపై పడిపోయాడు. ఎందుకు తాగుతున్నావని తల్లి మందలించింది. దీంతో శివకుమార్‌ ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. అది గమనించిన తల్లిదండ్రులు, ఇరుగుపొరుగువారు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్‌ విద్యార్థిని అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: బీటెక్‌ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు..ఇస్నాపూర్‌ గ్రామానికి చెందిన భాను ప్రసన్న ఇస్మాల్‌ఖాన్‌పేట్‌ లోని ఎంఎన్‌ఆర్‌ కళాశాలలో బీటెక్‌ చదువుతోంది. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. 24వ తేదీన ఆమె కనిపించడంలేదు. కూతురు ఆచూకీ కోసం బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికారు. అయినా ఏ సమాచారం దొరకలేదు. దీంతో తన కూతురు అదృశ్యమైందంటూ తల్లి పార్వతమ్మ శుక్రవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేచరేణిలో రెండు ఇళ్లలో చోరీ

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి గ్రామంలో రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పొడపాటి రాజు కిరాణం షాపులో రూ.15 వేల నగదు, కర్రెడ్ల బాపురెడ్డి ఇంట్లో 20 తులాల వెండి, ఎల్‌ఈడీ టీవీ, వడ్లకొండ పరమేశ్వర్‌కు చెందిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ విషయమై రాజు ఒక్కడే ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


సంఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

జహీరాబాద్‌: రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జహీరాబాద్‌ మండలం మల్‌చల్మలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొల్ల మల్లేశం (38) ఈనెల 25 నుంచి కనబడకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం మల్‌చల్మ గ్రామ శివారులో వరద కాలువ వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భవిష్యనిధిపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న విశాల్‌ అగర్వాల్‌

రామచంద్రాపురం(పటాన్‌ చెరు): కార్మికులు భవిష్య నిధి నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని పీఎఫ్‌ ప్రాంతీయ కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌ అన్నారు. పటాన్‌చెరు ఈపీఎఫ్‌ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం బీహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధి ఆప్కే నికత్‌ 2.0 కార్యక్రమంలో భాగంగా ఈపీఎఫ్‌పై సందేహాలను తీర్చేందుకు ప్రతీ నెలా 27న ఈపీఎఫ్‌ అధికారులు కార్మికుల వద్దకు వచ్చి వివరించి, సమస్యలుంటే పరిష్కరిస్తారన్నారు. ఆరోజు ఏదైనా సెలవు దినం ఉంటే మరుసటి రోజు కార్యక్రమం చేపడతామని, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పీఎఫ్‌ కమిషనర్‌–2 రాహుల్‌ కుమార్‌, జిల్లా నోడల్‌ అధికారి జి.వి.రావు, భెల్‌ జనరల్‌ మేనేజర్‌ మగేంద్ర వర్మన్‌, భెల్‌ ఈపీఎఫ్‌ ట్రస్ట్‌ కార్యదర్శి మాధవరావు పాల్గొన్నారు.

డీఐఈఓ విచారణ



కొండపాక(గజ్వేల్‌): విద్యార్థినులతో లెక్చరర్‌ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై జిల్లా ఇంటర్మీడియట్‌ ఎడ్యుకేషన్‌ అధికారి సూర్యప్రకాశ్‌ విచారణ చేపట్టారు. శుక్రవారం కళాశాలకు వెళ్లి ప్రిన్సిపల్‌ ఇందిరాదేవి, లెక్చరర్‌, విద్యార్థినులను వేర్వేరుగా అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినుల ఫిర్యాదు లెటర్‌ను మరుసటి రోజు మార్చి రాయించుకున్న విషయంపై ప్రిన్సిపల్‌ను విచారించారు. కళాశాలలో జరుగుతున్న ఘటనలపై డీఐఈఓ అసహనం వ్యక్తం చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఈఓ తెలిపారు. అంతకు సర్పంచ్‌ చిట్టి మాధురిరెడ్డి, ఉపసర్పంచ్‌ ఆరె భాస్కర్‌ కళాశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు

చైన్‌స్నాచింగ్‌ దొంగల అరెస్ట్‌


సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగలు

మియాపూర్‌: రోడ్డుపై నడిచి వెళ్లే మహిళలను టార్గెట్‌ చేస్తూ.. బైక్‌పై వచ్చి బంగారు గొలుసులను లాక్కొని వెళుతున్న ఇద్దరిని చందానగర్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. శుక్రవారం సీఐ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన మున్నా మోహితే బొల్లారంలోని చర్చికాలనీలో ఉంటూ చిరు వ్యాపారం చేస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన కరణ్‌పారియల్‌ మోహితే అతనికి స్నేహితుడు. స్థానికంగా ఉంటూ జల్సాలకు అలవాటు పడ్డారు. డబ్బు సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 25వ తేదీన చందానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో హుడా ట్రేడ్‌ సెంటర్‌కు చెందిన రాజ్యశ్రీ లింగంపల్లిలోని మార్కెట్‌కు కూరగాయల నిమిత్తం వెళ్తుండగా, ఇద్దరూ బైక్‌పై వచ్చి మెడలోంచి మంగళసూత్రాన్ని లాక్కొని వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో చందానగర్‌ రెడ్డికాలనీలో నివాసముంటున్న లక్ష్మి అపర్ణఅపార్ట్‌మెంట్‌లో డ్యూటీ ముగిశాక, ఇంటికి తిరిగి వెళ్తుండగా సురక్ష హిల్స్‌ రోడ్డు నంబర్‌ –2 సమీపంలోకి రాగానే ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. దీంతో ఇద్దరూ వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా రెండు చోట్ల దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులు ఒక్కరే అని గుర్తించారు. ఈక్రమంలోనే నిందితులు మున్నా మోహితే, కరణ్‌ పారియల్‌ మోహితే దొంగిలించిన బంగారు ఆభరణాలను బీరంగూడలోని ఓ బంగారు దుకాణంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం అందింది. దీంతో చందానగర్‌ పోలీసులు, ప్రత్యేక బృందాలు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా దొంగతనాలకు పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు తులాల బంగారం, ఓ పల్సర్‌ బైక్‌, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించినందుకు మాదాపూర్‌ డీసీపీ శిల్పవల్లి చందానగర్‌ పోలీసులు, ప్రత్యేక బృందాలను అభినందించారు.

అదృశ్యం.. ఆపై శవమై


నరేశ్‌(ఫైల్‌)

తూప్రాన్‌: తూప్రాన్‌ పట్టణంలో అదృశ్యమైన వ్యక్తి ఓ పాడుబడిన బావిలో శవమై కనిపించాడు. కామారెడ్డి జిల్లా బిక్కనూర్‌ మండలం తిప్పారం గ్రామానికి చెందిన గొడుగు నరేశ్‌యాదవ్‌(23) కొన్నాళ్లుగా తూప్రాన్‌లో నివాసం ఉంటున్నాడు. పట్టణానికి చెందిన రుక్మోద్దీన్‌ వద్ద పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 21న పశువుల వద్దకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో భార్య మమత మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా శుక్రవారం సాయంత్రం పట్టణ పరిధిలోని ఆబోతుపల్లి గ్రామ సమీపంలో ఓ పాడుబడిన బావిలో శవమై కనిపించాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు అదృశ్యమైన గొడుగు నరేశ్‌గా గుర్తించారు. అయితే హత్యకు కారకులైన ముగ్గురిని అనుమానితులను పోలీసులు గుర్తించినట్టు సమాచారం. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.


లారీలో పశువులు

దూడలను తరలిస్తున్న లారీ పట్టివేత

కొండపాక(గజ్వేల్‌): దూడలను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దుద్దెడ శివారు రాజీవ్‌ రహదారిపై శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆసిఫాబాద్‌ జిల్లా కాగజ్‌నగర్‌ నుంచి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండా లారీలో దూడలను తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని సీజ్‌ చేసి, దూడలను తరలిస్తున్న అనిల్‌ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పది మందిపై కేసు

పటాన్‌చెరు టౌన్‌: హోటల్‌ వద్ద ఘర్షణ పడిన ఇరువర్గాలకు చెందిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పటాన్‌చెరు పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని ముత్తంగి ఓఆర్‌ఆర్‌ స్వీట్‌ హాట్‌ హోటల్‌కు గురువారం టీ తాగేందుకు వచ్చిన కొంతమంది హోటల్‌ సిబ్బందితో గొడవ పడిన విషయం తెలిసిందే. ఘటనపై ఇరువర్గాలు పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోచారం గ్రామానికి చెందిన రమేష్‌, గణేశ్‌, సాయి సుమత్‌, పవన్‌, శ్రావణ్‌, హోటల్‌ నిర్వాహకులు మొహ్మద్‌ సిరాజొద్దిన్‌, నూర్‌ బాష, నవాజ్‌ షరీఫ్‌, రాకేష్‌, శ్రీకాంత్‌ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


పోచయ్య (ఫైల్‌)

కొల్చారం(నర్సాపూర్‌): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ...మండల పరిధిలోని తుక్కాపూర్‌కు చెందిన మంగలి పోచయ్య(38), తన చిన్నాన్న కుమారుడైన పాండరితో కలిసి గురువారం రాత్రి బైక్‌పై పాపన్నపేట మండలంలో ఎన్కేపల్లికి బయలుదేరాడు. తుక్కాపూర్‌ దాటనే రంగంపేట వైపు నుంచి బైక్‌పై ఎదురుగా వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడిపోయిన పోచయ్య తలకు తీవ్ర గాయమైంది. వెనుక కూర్చున్న పాండరి కాలు విరిగింది. వెంటనే చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ పోచయ్య మృతి చెందాడు.

వాహనాల రాకపోకలకు అంతరాయం



బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన ట్రాలీ

జహీరాబాద్‌: పట్టణంలోని హౌసింగ్‌ బోర్డు కాలనీ రైల్వే అండర్‌ బ్రిడ్జి కింద ట్రాలీ వాహనం ఇరుక్కుపోయింది. శుక్రవారం మధ్యాహ్నం కాలనీ నుంచి పట్టణంలోకి వస్తున్న ట్రాలీ పైభాగం బ్రిడ్జి కింది నుంచి వెళ్లే క్రమంలో ఇరుక్కుపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్పందించిన పలువురు వాహనం టైర్లలో గాలిని తీసి, వాహనాన్ని బయటకు తీశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పటాన్‌చెరు మండల పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...


రాజేందర్‌ సింగ్‌ మృతదేహం

పటాన్‌చెరు టౌన్‌: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు వివరాల ప్రకారం... పోచారం గణపతిగూడేనికి చెందిన రాజేందర్‌ సింగ్‌ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 26న ముత్తంగి డీఎస్‌ కాలనీలోని అత్తగారింటికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళుతుండగా ఇస్నాపూర్‌ చౌరస్తా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన రాజేందర్‌ సింగ్‌ను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్‌...


విఠల్‌ మృతదేహం

పటాన్‌చెరు టౌన్‌: బైక్‌ను ట్రాక్టర్‌ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు వివరాల ప్రకారం..చిట్కుల్‌ గ్రామానికి చెందిన విఠల్‌(42) ప్రైవేట్‌ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం బచ్చుగూడెం గ్రామం నుంచి చిట్కుల్‌కు బైక్‌పై వస్తుండగా భూలక్ష్మమ్మ ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ ఢీ కొట్టింది. ప్రమాదంలో విఠల్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.